
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
5
మెదక్
జిల్లాల వార్తలు
గురువారం 29 ఆగస్టు 2024



గణనాథులు ముస్తాబు

వినాయక చవితి దగ్గరపడుతుండడంతో గణనాథుడి ప్రతిమలు ముస్తాబవుతున్నాయి. ఇప్పటికే పెద్దసంఖ్యలో విగ్రహాలను రూపొందించిన తయారీదారులు తుదిమెరుగులు అద్దుతున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో తయారీదారులు షెడ్లను ఏర్పాటు చేసుకుని వినాయక ప్రతిమలను తయారు చేస్తున్నారు. ఫొటోలు: సంగారెడ్డి స్టాఫ్ ఫొటోగ్రాఫర్









కుక్కలు బాబోయ్..

- సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శునకాల భయం
- 79,211 వీధి కుక్కల సంచారం
- ఏడాదిలో 2,811 మందికి కుక్కకాటు
- తీవ్రగాయాలతో ఆస్పత్రుల పాలు
- కంటితుడుపు చర్యలతోనే సరి
- ఊసులేని ఏబీసీ సెంటర్లు



సంగారెడ్డి పట్టణంలో కుక్కల స్వైర విహారం

నారాయణఖేడ్ పరిధిలోని బాచేపల్లి పంచాయతీలోని మంచినీళ్ల ట్యాంకు శుభ్రం చేయడానికి వచ్చిన పోగుల నగేశ్‌పై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఇదే గ్రామంలోని పాలకేంద్రం వద్ద ఓ చిన్నారిపై కుక్కలు విరుచుకుపడ్డాయి. గ్రామంలో ఓ రైతుకు చెందిన గేదె కుక్కల దాడిలో చనిపోయింది. ఒక్క గ్రామంలోనే ఇన్ని సంఘటనలు చోటుచేసుకున్నా అధికార యంత్రాంగం ఏ చర్యలు తీసుకోలేదు.

కల్హేర్ మండలం మార్డి గ్రామంలో గడిచిన మే నెలలో వీధికుక్కల దాడికి ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇళ్ల ముంగిట ఆడుకుంటున్న చిన్నారులపై కుక్కలు విరుచుకుపడి ముఖంపై గాయపరిచాయి. వారి ముక్కు చెంపలు తెగిపోయాయి. హఠాత్తుగా తలెత్తిన ఈ సంఘటనతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ వరకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



మార్డిలో కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు (ఫైల్)

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఆగస్టు 28: కుక్కకాటు సంఘటన లేకుండా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో తెల్లారడం లేదంటే అతిశయోక్తి కాదు. విశ్వాసానికి మారుపేరుగా చెప్పుకునే శునకాలను చూస్తేనే వెన్నులో వణుకుపట్టిస్తున్నాయి. ఏ వైపు నుంచి వచ్చి కరుస్తాయోనని జనం హడలిపోతున్నారు. రోడ్డుపై నడిచి వెళ్లాలంటేనే ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గుంపులుగుంపులుగా శునకాలు సంచరించడమే గాకుండా అన్నెంపున్నెం తెలియని అమాయకుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నాయి. ఇందుకు ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలే నిదర్శనం.

ఏటా వేలల్లో బాధితులు

ఒక్క ఏడాది వ్యవధిలోనే సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 2,811 మందిని కుక్కలు గాయపరిచినట్లుగా రికార్డులు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కుక్కకాటుకు సంబంధించి రేబిస్ ఇంజక్షన్ తీసుకున్న వారి సంఖ్య ఇది. ఒక్క నారాయణఖేడ్ ప్రభుత్వ ప్రభుత్వ ఆస్పత్రిలోనే గడిచిన ఎనిమిది నెలల కాలంలో 359 మందికి రేబిస్ ఇంజక్షన్ ఇచ్చారు. వెల్దుర్తి మండల ఆసుపత్రికి 323 మంది కుక్కకాటు మందు కోసం వచ్చారు. ప్రధానంగా సంగారెడ్డి, పటాన్‌చెరు, మెదక్, తూప్రాన్, జహీరాబాద్, జోగిపేట, నర్సాపూర్ ప్రాంతాల్లో శునకాల బీభత్సం అధికంగా కనిపిస్తోంది. అయితే జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రేబిస్ మెడిసిన్ పూర్తిగా అందుబాటులో ఉండడం ఒకింత ఉపశమనంగా చెప్పవచ్చు. లేదంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లే పరిస్థితి ఉండేది. ఇంజక్షన్‌తోపాటు విషమ పరిస్థితుల్లో ఉన్నవారిని హైదరాబాద్‌కు సైతం తరలించిన సంఘటనలు పదుల సంఖ్యల్లో లేకపోలేదు.

లెక్కింపుతోనే సరి..

సంగారెడ్డి జిల్లాలో 61,622 వీధి కుక్కలు ఉండగా మెదక్ జిల్లాలో 17,589 వీధి కుక్కలు ఉన్నట్లుగా జిల్లా పంచాయతీ శాఖ, పశుసంవర్ధకశాఖ అధికారులు లెక్క తేల్చారు. జిల్లాలో కుక్కల సంఖ్యను తేల్చడంతోపాటు అందులోని క్రూరమైన కుక్కలను ప్రత్యేకంగా గుర్తించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది ఆయా గ్రామాలు, పట్టణాల్లో కుక్కలను లెక్కించారు. అయితే కుక్కల గణనకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేసింది. ఇందులో ప్రతీగ్రామానికి, ప్రతీ మున్సిపల్ వార్డుకు ఒక కమిటీ చొప్పున ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ కమిటీ ఆధ్వర్యంలో శునకాలను లెక్కించి ప్రభుత్వానికి నివేదించాలని పేర్కొన్నారు. కానీ నామమాత్రంగానే శునకాల గణన జరిగినట్లుగా తెలుస్తోంది. సంబంధిత అధికారులు సైతం కుక్కలను లెక్కించాలంటే అనేక ఇబ్బందులు వస్తున్నాయని చెబుతూనే ఈ కార్యక్రమాన్ని ముగించారు. అయితే కుక్కలను లెక్కించారే తప్ప తగిన చర్యలు చేపట్టలేదనే విమర్శలు నెలకొన్నాయి.

ఏబీసీ సెంటర్లు ఏర్పాటు చేసేనా?

2021 సంవత్సరంలో సంగారెడ్డి జిల్లాలోని కందిలో ఏనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 7024 కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేశారు. నిత్యం 10-15 శునకాలకు మాత్రమే ఈ ఆపరేషన్లు నిర్వహించే పరిస్థితి కనిపిస్తోంది. ఈ లెక్కన సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని శునకాలకు సర్జరీలు చేయాలంటే 20 సంవత్సరాల సమయం పట్టే అవకాశం ఉంది. అందుకే ప్రతీ మున్సిపాలిటీలో ఈ ఏబీసీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ నెలకొంది. ఇప్పటికే వేలల్లో కుక్కల సంఖ్య ఉంది. భవిష్యత్తులో ఈ సంఖ్య ఇంకా పెరుగుతూ ఉంటుంది. వీటిని నియంత్రించాలంటే ఏబీసీ సెంటర్లతోనే సాధ్యమవుతుందనే అభిప్రాయాలు నెలకొన్నాయి. కుక్కలకు సంతానం కలగకుండా సర్జరీ చేయడం వల్ల వాటిని నియంత్రించవచ్చని ఏబీసీ సెంటర్లకు శ్రీకారం చుడుతున్నారు. కందిలో ఉన్నట్లుగా సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్, ఐడీఏ బొల్లారం, జోగిపేట, నారాయణఖేడ్, జహీరాబాద్, సదాశివపేట, మెదక్ జిల్లాలోని రామాయంపేట, మెదక్, తూప్రాన్, నర్సాపూర్ మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కుక్కల గుంపు



మెదక్ పట్టణంలో బాలుడి తలపై కుక్కకాట్లు (ఫైల్)



సంగారెడ్డి సాయినగర్‌లో బాలుడి గొంతు కొరికిన కుక్క (ఫైల్)



కందిలో కుక్కల దాడిలో గాయపడిన మహిళ (ఫైల్)



గుమ్మడిదలలో కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి (ఫైల్)

విధుల్లో నిర్లక్ష్యంపై కొరడా

- తహసీల్దార్, ఇద్దరు డాక్టర్ల సస్పెన్షన్
- బస్తీదవాఖానా డాక్టర్‌కు మెమో, స్టాఫ్‌నర్సు తొలగింపు

జోగిపేట, ఆగస్టు 28 : సంగారెడ్డి జిల్లా జోగిపేట ఏరియా ఆస్పత్రిలో విధులను నిర్లక్ష్యం చేసిన ఇద్దరు డాక్టర్లపై సస్పెన్షన్ వేటు పడింది. కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళవారం జోగిపేట, చింతకుంట గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె జోగిపేట ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేయగా.. పిడియాట్రిక్ వైద్యులు డా.నాగరాజుపాటిల్, డా.దివాకర్ అనధికారికంగా గైర్హాజరైనట్టు గుర్తించారు. దీంతో, వారిద్దరినీ సస్పెండ్ చేయాలని డీసీహెచ్‌ఎస్ డా.సంగారెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. ఆమె ఆదేశాల మేరకు వారిద్దరినీ సస్పెండ్ చేయాలని టీవీవీపీ కమిషనర్ డా.అజయకుమార్‌కు డీసీహెచ్‌ఎస్ లేఖ రాశారు. ఈమేరకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే, అందోలులోని బస్తీ దవాఖానాలో సమయపాలన పాటించని స్టాఫ్ నర్సు రేణుకను విధుల నుంచి తొలగించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని మెడికల్ ఆఫీసర్ రిజ్వాన్‌కు మెమో జారీ చేశారు. ఇక, మండలంలోని చింతకుంట గ్రామంలో కలెక్టర్ పర్యటనకు గైర్హాజరైన తహసీల్దార్‌పైనా వేటు వేశారు. విధులను నిర్లక్ష్యం చేసిన తహసీల్దార్ నజీంపై సీరియస్ అయిన కలెక్టర్ అయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

మునిపల్లి మండల వ్యవసాయాధికారిపై వేటు

మునిపల్లి: మునిపల్లి మండల వ్యవసాయాధికారి అనితారెడ్డిని సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి తెలిపారు. సదాశివపేట ఏవోగా పనిచేసిన ఆమె ఇటీవలే మునిపల్లి మండల వ్యవసాయాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. సదాశివపేటలో పనిచేసిన సమయంలో ఓ ఫర్టిలైజర్‌షాపు విషయంలో తప్పుడు నివేదిక ఇచ్చినట్టు తేలడంతో ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్టు తెలిపారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

- మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, ఆగస్టు 28: ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ మైదానంలో బుధవారం జిల్లాలోని అన్నీ స్టేషన్ల పెట్రోలింగ్ వాహనాల పనితీరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 నంబర్‌కు వచ్చిన ఫోన్ కాల్‌పై పెట్రోకార్ డ్రైవర్లు వేగంగా స్పందించాలని సూచించారు. పెట్రోలింగ్ వాహనాలను ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయించాలి, శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, సాయుధదళ డీఎస్పీ రంగనాయక్, ఆర్‌ఐ శైలేందర్, ఆర్‌ఎస్‌ఐ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

- జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన హోంగార్డు వరప్రసాద్ కుమారుడు సూరజ్‌ను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. అనంతరం, మెదక్ పట్టణ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుర్గాపతి కుటుంబానికి తోటి సిబ్బంది అందించిన రూ.80 వేలను అందజేశారు.

దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు నివారణకు చర్యలు

కౌడిపల్లి, ఆగస్టు 26: జిల్లాలో దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కౌడిపల్లిలోని పోలీస్‌స్టేషన్ బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లడుతూ ఆదివారం, సెలవు రోజుల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్టు గుర్తించామని తెలిపారు. ప్రమాదాల నివారణకు ముమ్మర తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే, గ్రామాల్లో దొంగతనాలు, సైబర్ నేరాలను అరికట్టేందుకు స్టేషన్ పరిధిలో ప్రతీ నెల 6 గ్రామాల్లో ఎస్‌ఐ ఆధ్వర్యంలో అవగహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, కౌడిపల్లి ఎస్‌ఐ రంజిత్ రెడ్డి ఉన్నారు.



సంగారెడ్డిలో న్యాయవాదులతో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 28 : జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా న్యాయవాదులంతా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ పేర్కొన్నారు. వచ్చే నెల 28వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయవాదులతో సమన్వయ సమావేశాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందనే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

సర్దుబాటుతో సరి!

- ఉపాధ్యాయుల రేషనలైజేషన్ షురూ
- మెదక్ జిల్లాలో 150 మంది అదనం
- అవసరమున్న పాఠశాలలకు కేటాయింపు
- నిరుద్యోగుల ఆశలు అడియాశలే!

మెదక్ అర్బన్, ఆగస్టు 28: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుండడంతో విద్యాశాఖ చర్యలకు ఉపక్రమించింది. టీచర్లు లేక ఇబ్బందులున్న బడులకు బోధకులను నియమించేలా జిల్లా యంత్రాంగం తాత్కాలిక చర్యలు చేపట్టింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్దుబాటు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఇప్పటికే మెదక్ జిల్లాలోని మండల విద్యాధికారులు ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించారు. అవసరానికి మించి ఉపాధ్యాయులుంటే వారిని అవసరమున్న స్కూళ్లకు సర్దుబాటు చేసేలా చర్యలు చేపట్టారు. జిల్లాలోని ఆయా మండలాల్లో విద్యార్థుల సంఖ్య అనుగుణంగా కంటే 150 ఎస్జీటీ పోస్టులు అధికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారి వివరాలను సేకరించి మండల విద్యాధికారుల పరిధిలోనే అంటే అదే మండలంలో సర్దుబాటు చేయనున్నారు. మండలంలో అదనపు టీచర్లు లేకపోతే ఇతర మండలాల్లో ఎక్కువ ఉన్నా తీసుకునే వీలు లేకుండా పోయింది.

నియామకాలు లేనట్టేనా?

ప్రభుత్వం టీచర్ల హేతుబద్దీకరణ నిర్ణయం తీసుకోవడంతో నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారు. డీఎస్సీ అభ్యర్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం కానుంది. జిల్లాలో మొత్తం 4,021 ఉపాధ్యాయ పోస్టులుండగా ప్రస్తుతం 3,366 మంది టీచర్లు పని చేస్తున్నారు. 655 పోస్టుల ఖాళీగా ఉన్నాయి. ఒక్క టీచర్ కూడా లేని పాఠశాలలు 11, ఏకోపాధ్యాయ బడులు 183 ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా విద్యార్థుల సంఖ్య లేక మూతపడ్డ బడులు 24 ఉన్నాయి.



టీచర్ల సర్దుబాటు చేపడుతున్నాం



విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బడుల్లో టీచర్ల సర్దుబాటు ప్రక్రియ మండల స్థాయిలో మాత్రమే చేపడుతున్నాం. జిల్లాలో విద్యార్థుల సంఖ్య కంటే అధికంగా ఉన్న పోస్టులను గుర్తించాం. దాదాపు 150 మంది ఉపాధ్యాయులను అవసరం ఉన్న పాఠశాలలకు తాత్కాలికంగా కేటాయిస్తున్నాం.

-రాధాకిషన్, డీఈవో, మెదక్

స్నానానికి వెళ్లి నీటమునిగి ఇద్దరు యువకుల మృతి



నెల్లూరి రాము



డప్పు నవీన్

మాసాయిపేట, ఆగస్టు 28 : నీట మునిగి ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో బుధవారం వెలుగు చూసింది. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేటకు చెందిన డప్పు నవీన్ (22), నెల్లూరి రాము (26), శేఖని రాజు కలిసి మంగళవారం మధ్యాహ్నం గ్రామసమీపంలోని క్వారీ గుంతలో స్నానానికి వెళ్లారు. కాసేపటికి నవీన్, రాము నీటమునిగారు. రాజు వారిని కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో భయంతో కేకలు వేస్తూ ఊర్లోకి వెళ్లి గ్రామస్థులకు విషయం చెప్పాడు. అప్పటికే వారిద్దరూ నీటిలో మునిగారు. పోలీసులకు సమాచారం అందించడంతో పాటు కుటుంబీకులు, గ్రామస్థులు గాలింపు చర్యలు చేపట్టగా అదేరోజు రాత్రి నవీన్ శవం బయటపడింది. బుధవారం గజఈతగాళ్ల సాయంతో వెతికించగా రాము శవం లభ్యమైంది. మృతదేహాలను పోస్టుమార్టం మృతుల కుటుంబీకులను.. పీసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పరామర్శించి బాధిత కుటుంబాలకు ఆర్థికసహాయం అందించారు.

మేళ్ల చెరువును కాపాడండి

● బీఎస్పీ నాయకుడు వినయ్‌కుమార్


హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో వినయ్

రామచంద్రాపురం, ఆగస్టు 28 : తెల్లాపూర్‌లోని మేళ్లచెరువు కబ్జాకు గురైందని బీఎస్పీ నాయకుడు వినయ్‌కుమార్ ఆరోపించారు. కొందరు రాజకీయ నాయకులు, బడా బిల్డర్లు చెరువులో మట్టి నింపారని ఆయన తెలిపారు. సర్వే నంబరు 385లో ఎలియన్స్ సంస్థ, సర్వే నంబరు 423, 386లో నెవీ ప్రాపర్టీస్, 422లో సంకల్ప హోమ్స్ సంస్థలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మట్టి వేసి నిర్మాణాలు చేపట్టారని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వివరించారు. వచ్చే వారంలో మేళ్ల చెరువును సందర్శిస్తానని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారని వినయ్ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు


మనోహర్ (ఫైల్)

వెల్దుర్తి, ఆగస్టు 28: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన వెల్దుర్తి మండల శివారులో బుధవారం చోటుచేసుకున్నది. ఏఎస్‌ఐ సాదత్‌మియా తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన పెద్ది మనోహర్ (23) మండలంలో జరుగుతున్న స్నేహితుడి వివాహానికి యూనికార్న్ వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెల్దుర్తి గ్రామశివారులో పట్టణానికి చెందిన హనుమాద్రి కిష్టాగౌడ్ టీవీఎస్ ఎక్సల్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మనోహర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన కిష్టాగౌడ్‌ను ఆసుపత్రికి తరలించారు. మనోహర్ మృతదేహాన్ని తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి తల్లి సత్తమ్మ, తండ్రి శ్రీనివాస్, చెల్లెలు దివ్య ఉన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పరిశ్రమపై 'పీసీబీ'కి ఫిర్యాదు


పీసీబీ ఈఈకి ఫిర్యాదు చేస్తున్న గడ్డపోతారం నాయకులు

జిన్నారం, ఆగస్టు 28: గడ్డపోతారంలో వ్యర్థ రసాయనాలు వదిలిన పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని నాయకులు బాలయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, పలువురు పీసీబీ మెంబర్ సెక్రటరీ, ఈఈలకు బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆర్సీపూర్‌లోని కార్యాలయంలో ఈఈ కుమార్‌పాటక్‌కు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. రెండురోజులుగా ఓ పరిశ్రమ ఔట్‌లేట్ నుంచి భారీ ఎత్తున వ్యర్థాలను బయటకు వదిలారని, అధికారులు శాంపిల్స్ కూడా సేకరించారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఇంద్రేశంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

పటాన్‌చెరు, ఆగస్టు 28: పటాన్‌చెరు మండలం ఇంద్రేశం పంచాయతీ పరిధిలో అనుమతులకు మించి నిర్మించిన కట్టడాలను పంచాయతీ సిబ్బంది బుధవారం కూల్చేశారు. పంచాయతీ పరిధిలోని పీఎన్ఆర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లు జీ +2 అనుమతులు తీసుకుని అక్రమంగా అంతస్తులు నిర్మించడంతో పంచాయతీ చర్యలకు ఉపక్రమించింది. పోలీసుల రక్షణలో పంచాయతీ సిబ్బంది శ్లాబులను కూల్చేశారు. నిర్మాణదారులకు గతంలోనే నోటీసులు జారీ చేసి నేడు కూల్చివేశామని ఈవో సుభాష్ తెలిపారు.

సిర్గాపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న సంగ్రామ్ మహరాజ్

కల్హేర్, ఆగస్టు 28: సిర్గాపూర్‌లోని సేవా భారతి గణేష్ మండపంలో శ్రీ వరసిద్ధి వినాయకసహిత వీర హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సేవాభారతి గణేష్ మండపంలో నిర్మించిన ఆలయంలో విగ్రహాలకు జలాధివాసం, ధాన్యాధివాసం, ఫల, పుష్పాధివాసాలు నిర్వహించిన అనంతరం ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహరాజ్, ప్రముఖ వాస్తు శాస్త్ర పండితుడు గురునాథ్ మహరాజ్‌లు పాల్గొని ప్రవచనాలు చెప్పారు. కార్యక్రమంలో సేవాభారతి యువజన సంఘం బాధ్యులు, సిర్గాపూర్ మాజీ ఎంపీటీసీ పీరప్ప, మాజీ సర్పంచులు స్వప్న శంకరయ్య స్వామి, శ్రీనివాస్‌రావ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావ్, సీఆర్పీ శివకుమార్, నాయకులు మహేశ్వర్‌గుప్త పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం


మహంకాళీ అమ్మవారు

చేగుంట, ఆగస్టు 28 : చేగుంటలోని మహంకాళీ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఈనెల 29న 6 గంటలకు సుప్రభాతము నిత్యపూజా హారతి, గణపతిపూజ, 30న అమ్మవారికి పంచామృత అభిషేకం, చండీహోమం 108 కలశాల ఊరేగింపు, 31న రుద్ర మండప హోమాలు, మహా పూర్ణహుతి, అమ్మవారికి ఒడి బియ్యం, 1న బోనాలు తొట్టెల ఊరేగింపు, 2న అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ఇందిరా మహిళాశక్తి

హుస్నాబాద్ డివిజన్‌కు 524 డెయిరీ యూనిట్లు మంజూరు

- పూర్తయిన లబ్ధిదారుల ఎంపిక
- పాడి పశువుల కొనుగోలుపై అవగాహన
- ఒక్కో యూనిట్ రూ.93 వేలు



పాడి గేదె నుంచి పాలు సేకరిస్తున్న మహిళ

కోహెడ, ఆగస్టు 28: స్వశక్తి మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇందిరా మహిళాశక్తిని ప్రభుత్వం అమలుచేస్తోంది. ఇందులో భాగంగా మహిళలతో డెయిరీ యూనిట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు చర్యలు చేపట్టారు. డెయిరీ యూనిట్‌లో భాగంగా పాడిగేదె కొనుగోలు రూ.75 వేలు, పశు దాణ రూ.7,200, గేదె రవాణా రూ.3 వేలు, పశు బీమా రూ.5,088, రవాణా బీమా రూ.443, షేర్ క్యాపిటల్ రూ.1,704, సురక్ష చార్జీలు రూ.835, మొత్తం యూనిట్ విలువ రూ.93,270 ఉంటుంది.

524 యూనిట్లు మంజూరు

ఇందిరా మహిళాశక్తి పథకం కింద మొదటివిడతలో హుస్నాబాద్ డివిజన్‌కు 524 యూనిట్లు కేటాయించారు. కోహెడ మండలానికి 156 యూనిట్లు, హుస్నాబాద్‌కు 84 యూనిట్లు, అక్కన్నపేటకు 144 యూనిట్లు, మద్దూరు మండలానికి 140 యూనిట్లు మంజూరయ్యాయి. స్వశక్తి సంఘాల్లో ఆసక్తి ఉన్న మహిళా సభ్యుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కోహెడలో 156 యూనిట్లకు 173 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. తెలంగాణ మినహా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుంచి పాడి గేదెలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఒక్కొక్క పాడి గేదె యూనిట్‌కు మొదటగా రూ.93,270 రుణం మంజూరు చేశారు. ఈ రుణంతో ఆవు లేదా గేదెను కొనుక్కోవాలి. ఈ రుణాన్ని లబ్ధిదారు నెలకు రూ.2,500 చొప్పున 48 వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఆరునెలలు అనంతరం మరొక పాడి గేదె కొనుగోలుకు రుణం మంజూరు చేస్తారు.

పశు వైద్యులతో అవగాహన

మండలంలోని ఐకేపీ ఆధ్వర్యంలో పశువైద్యాధికారులతో మహిళా సంఘాల సభ్యులకు పాడి పశువుల కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. పశువుల బ్రీడ్ ఎంపిక, అధిక పాల దిగుబడిని ఇచ్చే పశువుల లక్షణాలు, అందించాల్సిన దాణ, వాటికి వచ్చే వ్యాధులు, దూడల పెంపకం, మొదలగు అంశాలపైన అవగాహన కల్పించారు.

బల్క్‌మిల్క్ సెంటర్‌కు ప్రతిపాదనలు

మహిళల నుంచి సేకరించిన మొదటి సంవత్సరం 3 వేల లీటర్ల పాలు ప్రభుత్వ డెయిరీ సిద్దిపేట విజయ కేంద్రానికి పంపించనున్నారు. ఇందుకుగాను కోహెడ మండలం బస్వాపూర్‌లో 7,500 లీటర్ల కెపాసిటీ గల బల్క్‌మిల్క్ సెంటర్ ఏర్పాటు చేయాలని గుర్తించారు. తహసీల్దార్‌కు స్థలం గుర్తించి ఎంపిక చేసి ప్రతిపాదించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. సుమారు రూ.80 లక్షల ఖర్చవుతుందని ప్రతిపాదించారు.



కోహెడలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి శ్రావణ్‌కుమార్

15 రోజుల్లో గ్రౌండింగ్



పక్క రాష్ట్రాల నుంచి పాడి గేదెలను కొనుక్కోవాల్సి ఉంటుంది. 15 రోజుల్లో డెయిరీ యూనిట్ల గ్రౌండింగ్ పూర్తి చేస్తాం. లబ్ధిదారులను ఎంపిక చేయడంతో పాటు పాడి గేదెల ఎంపికపై అవగాహనా సదస్సులు నిర్వహించడం జరిగింది.

- తిరుపతి, ఏపీఎం, కోహెడ

పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో పులిమామిడి రాజు



పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పులిమామిడిరాజు

సదాశివపేట, ఆగస్టు 28: సదాశివపేట పట్టణ సమీపంలోని వెంకటాపూర్ గ్రామంలో శ్రీమార్కండేయ కాలనీలో నిర్మించిన ఆలయంలో బుధవారం శ్రీబోరంచ పోచమ్మతల్లి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అందులో భాగంగా ఆలయంలో అగ్నిప్రతిష్ఠ, యజ్ఞం, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు గంగారాం, సిద్ధిరాములు, శ్యాంరావు, మల్లప్ప, చంద్రమౌళి, రాంచందర్, మనోహర్, సురేష్, హరిక్రిష్ణ, రాము, నర్సింహా, వీరేశం, అరుణ్‌కుమార్, సాయన్న, రాజు, ఈశ్వరయ్య, సదానందం పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



యాకుబ్ మృతదేహం

మిరుదొడ్డి, ఆగస్టు 28: విద్యుదాఘాతంతో వ్యక్తి బుధవారం మృతిచెందాడు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి మధిర గ్రామమైన మాదన్నపేట గ్రామానికి చెందిన యాకుబ్(35) గ్రామ శివారులోని యాదగిరి అనే రైతు స్టార్టర్ డబ్బాను రిపేర్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అప్పులబాధతో ఆత్మహత్య

గజ్వేల్, ఆగస్టు 28: అప్పులబాధతో వ్యక్తి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గజ్వేల్ మండల పరిధి బూర్గుపల్లి గ్రామానికి చెందిన చెలిమేటి చంద్రం(30) గుత్తేదారుగా ఇళ్లను నిర్మిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో అప్పులు పెరిగిపోవడంతో తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపం చెందాడు. రెండురోజుల క్రితం భార్య, పిల్లలను గజ్వేల్ మండల పరిధి ర్యాగట్లపల్లిలోని వారి తల్లి ఇంటి వద్ద వదిలేసి వచ్చాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి చంద్రం విగతజీవిగా కనిపించాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ బి.సైదా తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దుబ్బాక, ఆగస్టు 28: ప్రమాదవశాత్తు నీటిలో పడిన వ్యక్తి.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. దుబ్బాకలోని డబుల్ బెడ్‌రూం కాలనీకి చెందిన రియాజ్(17) ఈనెల 24న దుబ్బాకలోని బొడనికుంటలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడ్డాడు. అక్కడే ఉన్న శివ అనే వ్యక్తి రియాజ్‌ను బయటకు తీశాడు. 108 అంబులెన్స్ సహాయంతో దుబ్బాక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటకు, అనంతరం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అత్యాచారయత్నానికి పాల్పడ్డ యువకుడి అరెస్ట్

నారాయణఖేడ్, ఆగస్టు 28: మతిస్థిమితం సక్రమంగా లేని వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో మతిస్థిమితం లేని 64 ఏళ్ల వృద్ధురాలు సోమవారం రాత్రి పట్టణంలోని రాయిపల్లి మార్గంలో ఉన్న రోడ్డు మీద నిద్రించింది. రాత్రి 11.40 గంటల సమయంలో ఖేడ్ పట్టణానికి చెందిన మహబూబ్(27) మద్యం సేవించి.. అటుగా నడుచుకుంటూ వచ్చాడు. వృద్ధురాలిని గమనించి అత్యాచారయత్నం చేయగా.. అటువైపు నుంచి బైక్‌లపై వస్తున్న వారు గమనించి అరవడంతో పారిపోయాడన్నారు. వారు మంగళవారం షోరూం ముందు ఉన్న సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా.. ఈ విషయం బయటకు వచ్చిందన్నారు. బాధితురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు.

సరిపడా బస్సుల్లేక ప్రయాణికుల ఇక్కట్లు



సరిపడా బస్సులు లేక వచ్చిన బస్సులోనే ఎగబడి ఎక్కుతున్న ప్రయాణికులు

నర్సాపూర్, ఆగస్టు 28: నర్సాపూర్ నుంచి సంగారెడ్డికి వెళ్లే మార్గంలో రద్దీకి తగ్గ బస్సులు లేక వచ్చిన బస్సుల్లో సామర్థ్యానికి మించి వెళ్తూ.. ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. నర్సాపూర్ నుంచి సంగారెడ్డికి విద్యనభ్యసించేందుకు విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులతో పాటు ఇతర పనుల కోసం వెళ్లేవారు వందలాది మంది ఉంటారు. ముఖ్యంగా విద్యార్థులకు, ఉద్యోగులకు ఉదయం, సాయంత్రం పూట సరిపడా బస్సులు లేవు. దీంతో వచ్చిన బస్సులో ఎగబడి ఎక్కాల్సిన పరిస్థితి వస్తుందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ఎగబడి ఎక్కే క్రమంలో ఇదే అదునుగా భావించిన కొందరు చేతివాటం చూపుతుండడంతో ఫోన్లు, పర్సులు, నగలు కూడా పోతున్నాయని పేర్కొంటున్నారు. నర్సాపూర్‌లో డిపో ఉన్నా ఇక్కడి నుంచి సంగారెడ్డికి ఈ డిపో బస్సులు నడపకపోవడంతో గజ్వేల్, సంగారెడ్డి డిపో బస్సులపై ఆధారపడాల్సి వస్తుందని, అవి ఎప్పుడు వస్తాయో.. కూడా తెలియని పరిస్థితి ఉన్నదన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా నర్సాపూర్ నుంచి ఉదయం సాయంత్రం పూట సరిపడా బస్సులు నడపాలని కోరుతున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేలు అమలు చేయాలి

- సంగారెడ్డిలో మహార్యాలీ, నిరసన దీక్ష



సంగారెడ్డిలో మహార్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 28: విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేలు అమలు చేయాలని సమగ్ర శిక్ష జేఏసీ అధ్యక్షుడు శేషాద్రి డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం సమగ్ర శిక్ష ఉద్యోగులు సంగారెడ్డిలో మహార్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నేరవేర్చాలని కోరారు. గతేడాది హన్మకొండలో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెలరోజుల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ప్రకటించిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. ఆరోగ్యభీమా రూ.10 లక్షలు, జీవితభీమా రూ.10 లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపక్షంలో దశలవారీగా పోరాటాలు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొత్తూరు ప్రభుత్వ భూమిని కాపాడండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొత్తూరు గ్రామస్థులు

ములుగు, ఆగస్టు 28: కొత్తూరు గ్రామంలో ధరణిలో పేర్లు తప్పుపడడంతో ప్రైవేటు కంపెనీ పేరుమీద వస్తుందని, దాన్ని సరిచేయాలని బుధవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆధ్వర్యంలో కలెక్టర్ మనుచౌదరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ కొత్తూరు గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు. గ్రామ పరిధిలోని గూనెవారి కుంట సర్వే నంబరు 290లో 9-22 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, గత ప్రభుత్వంలోని ధరణి తప్పిదాల ఫలితంగా ఒక ప్రైవేట్ కంపెనీ పేరు నమోదైనట్లు పేర్కొన్నారు. దాన్ని వెంటనే తొలగించి జరిగిన తప్పిదాన్ని సరిచేయాలని కోరారు. అదేవిధంగా ఈ కంపెనీ నుంచి వచ్చే కలుషిత నీటిని కుంటలోకి వదలడంతో ఆ నీటిని తాగిన పశువులు, నీటిలోని చేపలు మృత్యువాత పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో కొత్తూరు గ్రామ నాయకులు రజనీకాంత్, సతీష్, అరుణ్, ప్రసాద్, శివకుమార్ నరేష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 28: రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సిద్దిపేట జిల్లా ములుగు మండలం కొక్కొండ గ్రామానికి చెందిన రవీందర్ తన కొడుకు సాత్విక్(14)తో బైక్‌పై మేడ్చల్ పట్టణం జాతీయ రహదారి పైనుంచి చెక్ పోస్టు వైపు మంగళవారం రాత్రి వెళ్తుండగా.. వెనకనుంచి వచ్చిన వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రవీందర్, సాత్విక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా.. ఇందులో సాత్విక్ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

సకాలంలో కుటుంబ నిర్ధారణ సర్వేను పూర్తి చేయాలి

- సంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్
- కవేలిలో కుటుంబ నిర్ధారణ ఇంటింటి సర్వే పరిశీలన



కవేలిలో రైతులతో మాట్లాడుతున్న డీఏవో శివప్రసాద్

కోహీర్, ఆగస్టు 28: రెండు లక్షల రుణమాఫీ కానీ రైతుల కుటుంబ నిర్ధారణ ఇంటింటి సర్వేను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. బుధవారం కోహీర్ మండలంలోని కవేలి గ్రామంలో మండల వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్ నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను డీఏవో పరిశీలించి మాట్లాడారు. రూ.2 లక్షలలోపు రుణమాఫీ కాని రైతుల వివరాలను ప్రభుత్వం రూపొందించిన రైతుభరోసా, పంట రుణమాఫీ యాప్‌లో పొందుపర్చాలన్నారు. రుణమాఫీ కాని రైతుల కుటుంబ నిర్ధారణ సర్వేలో భాగంగా కుటుంబసభ్యుల ఆధార్‌తో పాటు భూమి సర్వే నంబరు లోన్ ఖాతా వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అంతేకాకుండా ఈ సర్వేను డివిజన్ వ్యవసాయ అధికారి ఎప్పటికప్పుడు పరిశీలించాలని డీఏవోను ఆదేశించారు. రుణమాఫీ కాలేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్నారు. అనంతరం పలువురు రైతులతో డీఏవో మాట్లాడారు. ఆయన వెంట ఏడీఏ బిక్షపతి, మండల ఏవో నవీన్‌కుమార్, ఏఈవో శ్రీనివాస్, రైతులు తదితరులు ఉన్నారు.

ఏవోకు మాత్రమే లాగిన్‌తో సర్వేకు ఆలస్యం

కోహీర్ మండలంలో చాలామంది రైతులకు రెండు లక్షల రూపు రుణమాఫీ కాలేదు. ఇందుకు సంబంధించి రైతులు ఆయా రైతువేదికల వద్ద వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారుల వద్దకు దరఖాస్తులు పట్టుకుని నిత్యం తిరుగుతున్నారు. అయితే ప్రభుత్వం అర్హులైన రైతులకు రుణమాఫీ రాలేనందున ఆ రైతులకు తిరిగి రుణమాఫీ అందించేందుకు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. రైతుల వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో పొందుపరిచేందుకు మండల వ్యవసాయ అధికారికి మాత్రమే అనుమతి ఇచ్చింది. ఏవోలకు మాత్రమే లాగిన్ ఉండడం వల్ల అందరి వివరాలు ఒకరే చేయాలంటే ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉన్నది. అంతేకాకుండా సకాలంలో సర్వే పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. క్లస్టర్ వారీగా క్లస్టర్ ఏఈవోలకు లాగిన్ ఐడీలు ఇస్తే సర్వే తొందరగా పూర్తవుతుందని పలువు రైతులు పేర్కొన్నారు.

విద్యుత్ అమరుల స్ఫూర్తితో పోరాటాలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య



సంగారెడ్డిలోని కేకే భవన్‌లో విద్యుత్ అమరువీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 28: బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అసువులు బాసిన విద్యుత్ అమరుల స్ఫూర్తితో పోరాటాలు సాగిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో బుధవారం విద్యుత్ అమరువీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో విద్యుత్‌చార్జీల వ్యతిరేక ప్రదర్శన సందర్భంగా బషీర్‌బాగ్ వద్ద పోలీసులు జరిపిన కాల్పుల్లో రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డిలు అమరులయ్యారని అన్నారు. చంద్రబాబునాయుడు విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకురావడానికి ప్రయత్నిస్తే విద్యుత్ రంగం ప్రభుత్వ రంగంలోనే ఉండాలని, ప్రైవేటుపరం చేయవద్దని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ పోరాటం చేశామని గుర్తుచేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధి బృందం ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో పర్యటన చేసిందని, ఈ పర్యటనలో ప్రపంచ బ్యాంకుతో ఏం చర్చలు జరిపారు. ప్రపంచ బ్యాంకు ఎలాంటి సలహాలు ఇచ్చిందో తెలంగాణ ప్రజలకు బహిర్గతం చేయాలని చుక్క రాములు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సర్వే



శివాజీనగర్‌లో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 28: సీజనల్ వ్యాధులపై సంగారెడ్డి పట్టణంలోని శివాజీనగర్‌లో బుధవారం వైద్య సిబ్బంది సర్వే నిర్వహించారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికున్‌గున్యా కేసులు ఎన్ని ఉన్నాయనే వివరాలు సేకరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారాన్ని వేయకూడదని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఎం.కీర్తి, ల్యాబ్ టెక్నీషియన్ ఉమామహేశ్వర్‌రెడ్డి, సంగమేశ్వర సమాఖ్య సభ్యురాలు మాధవి పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయ పాలకవర్గం ఏర్పాటెప్పుడో?

- ఎటూ తేల్చలేని కాంగ్రెస్ ప్రభుత్వం
- కమిటీ చైర్మన్ పదవి కోసం ఆశావహులు ఎదురుచూపులు



వీరభద్రస్వామి ఆలయం

గుమ్మడిదల, ఆగస్టు 28: భక్తులకు కొంగు బంగారమైన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయ నిర్వహణకు పాలకవర్గం ఏర్పాటులో తీవ్ర జాప్యం నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఆరునెలలు దాటినా పాలకవర్గాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైందని విమర్శలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల ముందు ఆలయశాఖ నోటిఫికేషన్ ఇచ్చినా.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆ నోటిఫికేషన్ రద్దయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాలకవర్గం ఏర్పాటు ప్రక్రియ మొదటికొచ్చింది. దీంతో ఆశావహులు నిరాశకు గురవుతున్నారు. కాగా ఆలయ చైర్మన్ పదవి కోసం ఆశవహులు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. కొంతకాలం క్రితం ఈ ఆలయ కమిటీ ఏర్పాటుపై మండల నాయకులతో అధిష్ఠానం చర్చించినట్లు సమాచారం. జిల్లాలోని శైవక్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన బొంతపల్లి వీరన్న వీరభద్రస్వామి ఆలయం అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలంటే చైర్మన్ పదవికి ఎవరు సమర్థుడు అనే కోణంలో చర్చించి.. వారి పేరు ఇవ్వాలని మండల నాయకులతో చెప్పినట్లు సమాచారం. మండల నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఏకతాటిపై ఓ మండల యువ నాయకుడి పేరు ప్రతిపాదించి అధిష్ఠానానికి పంపినట్లు తెలిసింది. కాగా చైర్మన్ పదవి స్థానిక బొంతపల్లి గ్రామానికి చెందినవారికే ఇవ్వాలని కొందరు సీనియర్ నాయకులు వాదిస్తున్నారు. మెజార్టీ నాయకులంతా పక్క గ్రామానికి చెందిన ఆ యువకుడి పేరే ప్రతిపాదన చేయడంతో పాలకవర్గానికి పోటీలేదు. అధిష్ఠానం పాలకవర్గాన్ని ప్రకటించడమే ఆలస్యమని భావించారు. పాలకవర్గ ప్రక్రియ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయింది. దీంతో ఆశవహులు నిరాశ, నిస్పృహలకు గురయ్యారు. పార్లమెంట్ ఎన్నికల ముగిసి రెండునెలలు గడిచినా.. ఇప్పటికీ ఆలయ పాలకవర్గం ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టిసారించలేదు. కాగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరిపోవడంతో పాలకవర్గం ఏర్పాటు తొందర్లో జరుగుతుందని పలువురు ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్‌లో కష్టపడిన కార్యకర్తలకే పదవులు వస్తాయని ఎమ్మెల్యే సైతం చెప్పడం మండల సీనియర్ నాయకుల్లో సంతృప్తినిచ్చింది. దీంతో గతంలో ప్రతిపాదించిన ఆ యువ నాయకుడికే ఆలయ కమిటీ చైర్మన్ పదవి దక్కే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. మిగతా డైరెక్టర్ పదవులు కూడా పార్టీ కోసం పదేళ్లు కష్టపడిన వారికే దక్కనున్నాయి.



బీదర్ రోడ్డుపై చెట్లతో ప్రకృతి పరిచిన పందిరి



మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్‌లో జలపాతం

కనువిందు చేస్తున్న ప్రకృతి సోయగం

- బీదర్, కోహీర్, మొగుడంపల్లి రోడ్లపై పందిరి వేసిన చెట్లు
- జాడిమల్కాపూర్‌లో జాలువారే జలపాతం
- నేలపై పచ్చని తివాచీ పరిచిన పొలాలు, గుట్టలు



విట్టునాయక్‌తండా చుట్టూ పచ్చందనం



ఆనెగుంట-లచ్చునాయక్‌తండాల సమీపంలో నేలపై ప్రకృతి పరిచిన గ్రీనరీ

జహీరాబాద్, ఆగస్టు 28: ప్రకృతి రమణీయతను పంచుతూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, కర్ణాటకలోని గొట్టంకోట అందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ అందాలను తిలకించేందుకు నిత్యం వందలాది మంది పర్యాటకులు వస్తుంటారు. విట్టునాయక్‌తండా గుట్టపై ఉండడంతో ప్రకృతి పరిచిన గ్రీనరీ ఎంతగానో ఆకట్టుకుంటున్నది. ఆనెగుంట-లచ్చునాయక్‌తండాల సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఎక్కడచూసినా కొండలు, గుట్టలు, పంట పొలాలు పచ్చని తివాచీ పరిచినట్లు కనిపిస్తాయి. మండలంలోని గోవిందాపూర్ మీదుగా మొగుడంపల్లి, ఇప్పెపల్లి, జహీరాబాద్ మీదుగా బీదర్ వెళ్లే రోడ్డుపై రైల్వే గేటు మొదలుకుని అల్లానా చౌరస్తా వరకు, కోహీర్ మండలంలోని కోహీర్ చౌరస్తా-కవేలి గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు పచ్చని పందిరి వేసేలా కనిపిస్తున్నాయి. మొగుడంపల్లి సమీపం కర్ణాటకలోని గొట్టంకోట అందాలు కూడా చూపరులను కనువిందు చేస్తున్నాయి. మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్‌లో జలపాతాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

అట్టహాసంగా ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో స్కూల్ ఫెడరేషన్ క్రీడలు (ఎస్ జీఎఫ్) మండలస్థాయి పోటీలను బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. రెండు రోజులపాటు జరిగే ఈ క్రీడాపోటీల్లో ఆయా మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన అండర్ 14, అండర్ 17 బాల, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జహీరాబాద్‌లో పోటీలు ముగిశాయి. మండల స్థాయి విజేతలు జిల్లాస్థాయిలో పోటీ పడాల్సిఉంటుంది.

పటాన్‌చెరు, ఆగస్టు 28: నియోజకవర్గంలో ప్రతి మండల కేంద్రంలో ఒక మినీ స్టేడియం ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని మైత్రీ మినీ స్టేడియంలో 68వ (ఎస్‌జీఎఫ్) స్కూల్ ఫెడరేషన్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రతీ మండలంలో మినీ స్టేడియంల నిర్మాణానికి స్థలాలను సేకరించామని, దశలవారీగా మినీ స్టేడియాలను, క్రీడావసతులను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, ఎంఈవో రాథోడ్, మాజీ మార్కెట్ కమిటీ ఛైరన్‌విజయ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు. కాగా క్రీడాపోటీల సందర్భంగా మైత్రీమైదానంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫొటో పెట్టకపోవడంపై కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైనవారిపై కలెక్టర్, జిల్లా విద్యాధికారి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పటాన్‌చెరు మైత్రీ మినీస్టేడియంలో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

● కల్హేర్: సిర్గాపూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 68వ ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడోత్సవాలను స్థానిక ఉన్నత పాఠశాల పీజీహెచ్‌ఎం నాగారం శ్రీనివాస్ బుధవారం జెండా ఎగురవేసి ప్రారంభించారు. మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన అండర్ 14, అండర్ 17 బాల, బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయి.

● పుల్‌కల్, ఆగస్టు 28: ఉమ్మడి పుల్కల్ మండలంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడోత్సవాలను సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో ఎంఈవో వి.శంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో స్థానిక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి పోటీలను ప్రారంభించారు. మొదటి రోజైన బుధవారం అండర్ 14, 17 బాలికలు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడల్లో పోటీ పడ్డారు. చౌటకూర్‌లో జరిగిన క్రీడల్లో సుల్తాన్‌పూర్, శివంపేట, చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల బాలికలు హాజరయ్యారు. కాగా, పుల్కల్ మండలంలో జరిగిన క్రీడలకు పుల్కల్ కేజీబీవీ, బస్వాపూర్ ఆదర్శ పాఠశాల, సింగూరు, పెద్దారెడ్డిపేట, ముదిమాణిక్యం, గొంగ్లూరు, మిన్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల బాలికలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సీ.మోహన్ రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.



చౌటకూర్‌లో ఖోఖో, కబడ్డీ ఆడుతున్న బాలికలు

● జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మార్‌హెచ్‌ఎస్ గ్రౌండ్‌లో రెండో రోజైన బుధవారం ఆయా పాఠశాలల విద్యార్థులకు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి బస్వరాజ్ మాట్లాడుతూ రెండు రోజులుగా ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశామన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన వారు జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు.స్థానిక ఎమ్మార్‌హెచ్‌ఎస్ గ్రౌండ్‌లో నిర్వహిం చిన పోటీల్లో మండలంలోని 25 పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని వివరించారు. కబడ్డీలో పట్టణంలోని ఆర్ఎల్లార్, హోతి(కే)లో బాలికల గురుకుల కళాశాల, చిరాగ్‌పల్లి పాఠశాలలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వాలీబాల్ పోటీల్లో హోతి(కే), జడ్పీహెచ్‌ఎస్-జహీరాబాద్, సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాల రంజోల్‌కు చెందిన విద్యార్థులు విజయం సాధించారన్నారు. ఖోఖోలో హోతి(కే) గురుకుల పాఠశాల, రంజోల్ గురుకుల పాఠశాల,చిరాగ్‌పల్లి పాఠశాలలకు చెందిన విద్యార్థులు గెలుపొందారు. కాగా విజేతలుగా నిలిచినవారికి బహుమతులు ప్రదానం చేశారు.



జహీరాబాద్‌లో విజేతలకు మెమొంటోలను అందజేస్తున్న మండల విద్యాధికారి బస్వరాజ్, ఉపాధ్యాయులు

నేటి నుంచి చిన్నశంకరంపేటలో..

చిన్న శంకరంపేట , ఆగస్టు 28: ఈ నెల 29 న మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జూనియర్ కళాశాల లో నిర్వహిస్తారని టీఎస్ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య తెలిపారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యూపీఎస్ పాటశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

ప్రజా సమస్యలు పట్టని కాంగ్రెస్: ఎమ్మెల్యే



సంగారెడ్డి క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 28: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన గాడితప్పిందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకవైపు ఆసుపత్రుల్లో మందుల కొరత మరో వైపు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక బడుల మూతతో పరిపాలన పడకేసిందని విమర్శించారు. జిల్లా ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారిందని మండిపడ్డారు. జిల్లాలో సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చేస్తున్నదని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో దోమలు విజృంభించడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా ఆసుపత్రితో పాటు ప్రాంతీయ దవాఖానాలు, పీహెచ్‌సీల్లో మందులు కొరతగా ఉండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో టీచర్లకు కొరత లేదని, విద్యావలంటీర్లను నియమించి విద్యాబోధన కొనసాగించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా విద్యా వ్యవస్థను గాలికొదిలేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, జిల్లా మంత్రికి పతనమవుతున్న విద్య, వైద్యశాల తీరు కనిపించడం లేదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నరహరిరెడ్డి, సీడీసీ మాజీ ఛైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యం ద్వారానే సమాన అవకాశాలు



మాట్లాడుతున్న తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 28: సామర్థ్యం ద్వారానే సమాన అవకాశాలు దక్కుతాయని తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగాలు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో రుబెరో స్వచ్ఛంద సంస్థ సహకారంతో జెండర్ సెన్సిటీపేషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సామర్థ్యం ఉంటే అవకాశాలను అందుకోవటంలో అందరూ సమానమేనని ఇక్కడ స్త్రీ, పురుషుల భేదాన్ని చూపాల్సిన అవసరం లేదన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందిన ప్రస్తుత కాలంలో స్త్రీలు ఏ రంగంలోనూ పురుషులకు తీసిపోరన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్, కామర్స్ అధ్యాపకుడు రత్నప్రభాకర్, అధ్యాపకులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీ నీటి మూటలేనా?



కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ఐకేపీ వీవోఏలు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 28: రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ వీవోఏలకు ఇచ్చిన హామీ నీటి మూటలుగానే మిగిలిపోయాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు విమర్శించారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఐకేపీ వీవోఏలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఐకేపీ వీవోఏలకు సెర్ప్ నుంచి గుర్తింపు కార్డులు జారీ చేయాలని సాయిలు డిమాండ్ చేశారు. వీవోఏలకు రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం గ్రామసంఘాల నుంచి రూ.3వేలు ఇవ్వాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఐకేపీ వీవోఏలకు కనీ వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం వీవోఏలకు ఎన్నో హామీలు ఇచ్చి విస్మరిస్తున్నదన్నారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్తఫా, కోశాధికారి మల్లన్న, ఉపాధ్యక్షుడు అనిత, మాధవి, అంజనేయులు, విజయ, భాగ్యలక్ష్మి, నరేందర్, అన్వర్, సోషల్ మీడియా కన్వీనర్ నాగేందర్, వీవోఏలు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన భూమి పూజలో ఖేడ్ ఎమ్మెల్యే



భూమి పూజలో సీఎం, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 28: హైదరాబాద్‌లోని సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కోసం బుధవారం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి స్థానిక ఎమ్మెల్యేసంజీవరెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు భూమి పూజ చేయడంతో మంత్రులు, అధికారులు, సహచర ఎమ్మెల్యేలు పాల్గొన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

హత్నూర గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

హత్నూర, ఆగస్టు 28: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు తమ సర్టిఫికేట్లతో నేరుగా కళాశాల ప్రధానాచార్యులను కలవాలని ప్రిన్సిపాల్ భిక్షమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ-4, ఎస్సీ సీ-2, ఎస్టీ-3, బీసీ-4, మైనార్టీ-1, ఓసీ-1 ఖాళీలు ఉన్నాయన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 30వ తేదీ లోగా కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

జోగిపేట, ఆగస్టు 28: విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోకూడదని జోగిపేట ఎస్‌ఐ పాండు సూచించారు బుధవారం జోగిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు విఠల్, శ్రీనివాస్, శ్రవణ్, కుమార్, మల్లేశం, గోవర్ధన్ రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళకు కాంగ్రెస్ నాయకుల సాయం

జిన్నారం, ఆగస్టు 28: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. బొల్లారం మున్సిపాలిటీ మల్లన్న బస్తీకి చెందిన పుష్ప అనే మహిళ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతున్నది. బుధవారం బాధిత మహిళను కాంగ్రెస్ మున్సిపల్ శాఖా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, నాయకులు బషీర్, మునీర్, ప్రవీణ్‌రెడ్డి పరామర్శించి, 70వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

వాహనదారులపై రాంగ్‌సైడ్ కేసులు

రామచంద్రాపురం, ఆగస్టు 28: ద్విచక్ర వాహనాలపై వ్యతిరేక దిశలో ప్రయాణిస్తున్న ఐదుగురిని తెల్లాపూర్‌లో ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం వారిని కొల్లూరు పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేసి, నిందితులను కోర్టుకు తరలించారు.

ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో నేడు వృద్ధాప్య శిబిరం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 28: ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29 న కొండాపూర్ మండలం మల్కాపూర్ సబ్ సెంటర్‌లో వృద్ధుల ఆరోగ్యసమస్యల కోసం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆయూష్ శాఖ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ రవి చింతల ఒక ప్రకటనలో తెలిపారు. మధుమేహం, రక్తపోటు, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, అజీర్తి, కడుపులో మంట, మలబద్ధకం, అర్శమొలలు, దగ్గు, దమ్ము, స్త్రీ సంబంధిత వ్యాధులకు వైద్య సేవలు పొందవచ్చన్నారు. ఉదయం 10.30 గంటలకు టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి శిబిరాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

పన్నులు ఎగ్గొట్టి నీతులు చెప్పడమా !

● **మాజీ చైర్మన్‌పై తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ ధ్వజం**

తూప్రాన్, ఆగస్టు 28: మున్సిపాలిటీకి పన్నులు చెల్లించకుండా మోసం చేస్తూ, ప్రజలను పీడించి వసూళ్లు చేసినవారు నీతులు చెప్పడమా అంటూ మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్‌పై చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ ధ్వజమెత్తారు. అడ్డగోలుగా పన్నులు పెంచారంటూ మంగళవారం మాజీ చైర్మన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం మున్సిపల్ ఆవరణలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాఘవేందర్‌గౌడ్‌కు చెందిన ఫంక్షన్‌హాల్‌కు ఇప్పటి వరకు ఇంటి నంబరు లేదని, 22 ఏళ్లగా ఒక్క రూపాయి పన్ను కూడా చెల్లించలేదన్నారు. తన హయాంలో ప్రైవేటు ఏజంట్లను ఏర్పాటు చేసుకొని ప్రజలను పీక్కుతిన్న వ్యక్తి ఆరోపణలు చేయడమా? అంటూ ప్రశ్నించారు. నాలుగేళ్లుగా ప్రజలు పీడించి, దోచుకుని అధికారం పోవడంతో జీర్ణించుకోలేక ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే భువన్ యాప్ తీసుకురాగా మాజీ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించి ఇంటింటి సర్వే చేయించి పన్ను పెంచారని వివరించారు. తన హయాంలోనే పన్నులు పెంచి, మాపై బురద చల్లడమేంటని ప్రశ్నించారు. కౌన్సిలర్లు శ్రీశైలంగౌడ్, భగవాన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజు, నాయకులు రవీందర్‌గుప్తా, రఘుపతి పాల్గొన్నారు.



తూప్రాన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, పాలకవర్గం

నింబంధనల ప్రకారమే పన్ను పెంపు

తూప్రాన్ మున్సిపాలిటీలో నిబంధనల ప్రకారమే పన్నుల పెంపు జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజొద్దీన్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. పన్నుల పెంపులో వ్యత్యాసం లేదన్నారు. వ్యత్యాసం ఉన్నట్లు తన దృష్టికి తీసుకువస్తే సరిచేస్తానన్నారు.

సమాజంలోనే చదువుతోనే గుర్తింపు: ట్రైనీ కలెక్టర్ మనోజ్



లింగంపల్లి గురుకులంలో విద్యార్థులతో కలిసి భోంచేస్తున్న ట్రైనీ కలెక్టర్, డీఈవో

మునిపల్లి, ఆగస్టు 28 : మండలంలోని బుదేరా జడ్పీహెచ్ఎస్, ప్రైమరీ, ఉర్దూ మీడియం, లింగంపల్లి గురుకుల పాఠశాలలను డీఈవో వెంకటేశ్వర్లుతో కలిసి బుధవారం ట్రైనీ కలెక్టర్ మనోజ్ కుమార్ సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రశ్నించి పలు సమాధానాలు రాబట్టారు. విద్య చాలా గొప్పదని, సమాజంలో మంచి గుర్తింపు పొందాలంటే చదువు ఎంతో అవసరమని విద్యార్థులకు సూచించారు. అనంతరం గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. గురుకుల పాఠశాలకు మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మించాలని ప్రిన్సిపాల్, విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అంతకుముందు మరుగుదొడ్లను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురభి చైతన్యకు సూచించారు. వెంట ఎంఈవో దశరథ్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరుల పోరాటాల స్ఫూర్తితో పోరాడుదాం: సీపీఎం

కొండాపూర్, ఆగస్టు 28: విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడుదామని సీపీఎం పార్టీ కార్యదర్శి జయరాజు పేర్కొన్నారు. బుధవారం మందాపూర్‌లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యమంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ 2000సంవత్సరం ఆగస్టు 28న వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన చలో అసెంబ్లీ కార్యక్రమంలో బషీర్‌బాగ్‌లో చంద్రబాబు ప్రభుత్వం జరిపించిన కాల్పుల్లో రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి అసువులు బాసారన్నారు. కాల్పులతో పాటు గుర్రాలతో తొక్కించడం, భాష్పవాయు ప్రయోగంతో అనేక మంది గాయాలబారిన పడి నెలల తరబడి చికిత్సపొంది తేరుకున్నారని గుర్తు చేశారు. నాడు వంద రోజుల పాటు వామపక్షాలు పోరాటం చేస్తేనే 15 ఏళ్ల పాటు పెంచకుండా నిర్ణయాన్ని కట్టుబడిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం కార్యవర్గ సభ్యులు అతివెలు మాణిక్, మండల కార్యదర్శి రాజయ్య, నాయకులు బాబురావు, అర్జున్, అజయ్, శాంతమ్మ పాల్గొన్నారు.



విద్యుత్ పోరాటంలో అమరవీరులైనవారి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఎల్ఆర్ఎస్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్



తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో స్థల వివరాలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

రామచంద్రాపురం, ఆగస్టు 28: తెల్లాపూర్ మున్సిపాలిటీలో వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. దరఖాస్తుల పరిశీలనలో ఎదరవుతున్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుదారుడి స్థలానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

వట్‌పల్లి మండలంలో..



షాద్‌నగర్‌లో వివరాలను సేకరిస్తున్న అధికారులు

వట్‌పల్లి, ఆగసు 28: మండల పరిధిలోని షాద్‌నగర్, దేవనూర్ గ్రామాల్లో బుధవారం ఎల్ఆర్ఎస్ సర్వే నిర్వహించినట్లు ఎంపీడీవో శశిప్రభ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారి వివరాలతో గ్రామాల్లో పర్యటించి పూర్తి వివరాలను సేకరిస్తున్నామన్నారు. సేకరించిన వివరాలను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ షాంబిరెడ్డి పంచాయతీ సెక్రెటరీ శ్రీలత పాల్గొన్నారు

మహిళా శక్తి పథకాలపై అవగాహన



వ్యాపార సముదాయాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో శ్రీనివాసరావు

నిజాంపేట, ఆగస్టు 28: ఇందిరా మహిళా శక్తి పథకాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నిజాంపేట మండలంలోని గ్రామాల్లో బుధవారం మహిళా శక్తి పథకంలో భాగంగా ఏర్పాటు చేసుకున్న కొత్త వ్యాపార సముదాయాల దుకాణాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్థికంగా ఎదగడానికి ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలు మదర్ బర్డ్స్, కోళ్ల పెంపకం, వ్యాపార వాణిజ్య సంస్థలు, గ్రూపుల ద్వారా ఎంపిక చేసుకుని మహిళలు అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం సీసీలు వీవోఏలతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలు సెల్ఫ్ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రాములు, సీసీలు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతు కుటుంబాల సర్వే



నిజాంపేట: బచ్చురాజుపల్లిలో కుటుంబ నిర్ధారణ పత్రాన్ని రైతులకు అందజేస్తున్న మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి



మనోహరాబాద్‌లో రుణమాఫీ కాని రైతు ఇంట్లో వివరాలు సేకరిస్తున్న ఏవో స్రవంతి



కల్హేర్‌లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్

నిజాంపేట , ఆగస్టు 28 : అర్హత ఉండి రేషన్ కార్డు లేక రుణమాఫీ కానీ రైతు వివరాలు సేకరిస్తున్నామని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ పేర్కొన్నారు నిజాంపేట్ మండల పరిధిలోని బచ్చురాజుపల్లి గ్రామంలో బుధవారం రుణమాఫీ వర్తించని రైతులతో సమావేశం ఏర్పాటు చేసి కుటుంబ సభ్యుల వివరాలను రుణమాఫీ యాప్ ద్వారా సేకరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలో రేషన్ కార్డు లేని 272 కుటుంబ సభ్యుల జాబితా వచ్చిందని వివరాలు సేకరించి కుటుంబ సభ్యుల నిర్ధారణ యాప్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ ఆధికారి సోమలింగారెడ్డి, వ్యవసాయ విస్తరణ ఆధికారులు, రైతులు పాల్గొన్నారు .

● చేగుంట/మనోహరాబాద్: అర్హత కలిగి రేషన్ కార్డు లేక రుణ మాఫీ కాని రైతుల వివరాల కోసం బుధవారం చేగుంట, మనోహరాబాద్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో వ్యవసాయ ఆధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. చేగుంట మండలంలోని బి కొండాపూర్ గ్రామంలో చేగుంట ఏవో హరిప్రసాద్ రైతుల వివరాలు సేకరించారు. ఆయా రైతుల పూర్తి కుటుంబ వివరాలను రుణమాఫీ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో మొత్తం 629 మంది రైతు కుటుంబాల వివరాలను నిర్ధారణ చేయాల్సిఉందన్నారు. మనోహరబాద్ మండల కేంద్రంలోని మండల వ్యవసాయ అధికారి స్రవంతి ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టారు. మండలంలోని పర్కిబండ, మనోహరాబాద్ గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సంగారెడ్డి జిల్లాలో..

పుల్‌కల్/నారాయణఖేడ్/కల్హేర్, ఆగస్టు 28: రుణ మాఫీ కాని రైతులను గుర్తించేందుకు సంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ అధికారులు ఆయా గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో ఏవో ప్రవీణ, ఏఈవో దత్తు రాజ్‌లు బుధవారం ఇంటింటికి తిరుగుతూ రుణమాఫీ జాబితాలో పేర్లు లేని రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలను సేకరించారు. రుణమాఫీ కాని రైతులు పెద్దమొత్తంలో దరఖాస్తు చేయడంతో మండలంలోని అన్నీ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నట్టు తెలిపారు. మండలంలోని సంజీవన్‌రావుపేటలో బుధవారం రుణమాఫీ కాని రైతుల వివరాలను వ్యవసాయ అధికారులు కుటుంబ నిర్ధారణ యాప్‌లోనమోదు చేసి వారి నుంచి ధ్రువీకరణ పత్రాలను స్వీకరించారు. రుణమాఫీ కాని అర్హులైన రైతు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏవో శంకర్, ఏఈవో సతీష్‌కుమార్, క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు. కల్హేర్‌లోని రైతు వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో నారాయణఖేడ్ వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) నూతన్‌కుమార్ మాట్లాడారు. రేషన్ కార్డు లేని రైతులకు బ్యాంకులో పంట రుణం ఉండి రుణమాఫీ వర్తించని వారు తమ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలు, కుటుంబ ధ్రువీకరణ పత్రాలను ఏఈవోలకు సమర్పించాలని అన్నారు. అనంతరం ఆయన రైతు భరోసా పథకం కుటుంబ సభ్యుల ఆన్‌లైన్‌లో అప్‌లోడింగ్ విధానాన్ని పరిశీలించారు. ఏఈవోలు సంతోషకుమారి, ప్రతిభ, రైతులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి అండగా బీఆర్ఎస్ నాయకులు

● **కాలుష్య జలాలతో పశువులు మృతి చెందినందుకు రూ.2లక్షలు అందజేత**



కిష్టయ్యపల్లిలో సాయికుమార్ కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు

జిన్నారం, ఆగస్టు 28: పరిశ్రమల కాలుష్య జలాలు తాగి గేదెలు మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబాన్ని నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి, రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. బుధవారం గడ్డపోతారం పంచాయతీ కిష్టయ్యపల్లికి చెందిన బాశెట్టి సాయికుమార్ కుటుంబసభ్యులను బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు బాల్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, ప్రకాశంచారి, తొంట అంజయ్య, సురేందర్‌గౌడ్, జనార్దన్, ఆంజనేయులు, ఖదీర్, ఆకుల నవీన్, బాశెట్టి రాజు, పెంటేష్, వేణు, శ్రీనివాస్‌రెడ్డి, భీమ్‌రావు తదితరులు పరామర్శించారు. పరిశ్రమల నుంచి వెలువడిన కాలుష్య జలాలు తాగి సాయికుమార్‌కు చెందిన 12 పాడి గేదెలు వరుసగా మృతి చెందడంతో కుటుంబసభ్యులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం, పరిశ్రమలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలన్నారు.

కౌన్సిలర్ సొంత డబ్బుతో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు

నర్సాపూర్, ఆగస్టు 28: తన వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీ కోసం నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు కాకపోవడంతో తన సొంత డబ్బుతో పనులు చేపట్టి స్థానికుల ప్రశంసలందుకున్నాడు బీజేపీ కౌన్సిలర్. నర్సాపూర్ పట్టణంలోని పదో వార్డు కౌన్సిలర్ బుచ్చేస్‌యాదవ్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో ఓ వీధిలో సీసీ రోడ్డు, మురికికాల్వ లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన కౌన్సిలర్ రూ.2లక్షల సొంత నిధులు వెచ్చించి పనులు చేపట్టారు. అందులో భాగంగా బుధవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

బడంపేటలో ఘనంగా కట్టమైసమ్మ విగ్రహప్రతిష్ఠాపన



పోతురాజుల విన్యాసాల మధ్య బోనాల ఊరేగింపు

కోహీర్ ఆగస్టు 28: మండలంలోని బడంపేట గ్రామంలో బుధవారం కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోని దేవుని చెరువు కట్ట పైన ఇటీవల నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహాన్ని పతిష్ఠాపించారు. కార్యక్రమానికి వైరాగ్యశిఖామణి అవధూతగిరి మహారాజ్ బర్దిపూర్, శ్రీవీరేశ్వర శివచార్య హిరెమట్ ధనసిరి గురువులతో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం 3 గంటల సమయంలో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో కట్ట మైసమ్మకు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి సమర్పించుకున్నారు.